# 75 ఏండ్ల గణతంత్ర వేడుకల్లో సమస్యల ఘన స్వాగతాలు

### ("భారత గణతంత్ర వేడుకలు-2024" శుభ వేళ సమస్యల స్వాగతం)

భరతమాత హృదయం అఖండం, అద్వితీయం. పరాయి పాలనకు చరమగీతం పాడిన భారత పౌరులు స్వేచ్ఛాగీతాలు ఆలపిస్తూనే శుద్ధ సందర్భం. 26 జనవరి 1950 శుభ వేళ శ్వేతజాతీయుల పరాయి పాలనకు స్వస్తి పలికి స్వతంత్ర భారతంలో తనదైన పటిష్ట భారత రాజ్యాంగం అమలులోకి రావడంతో "సార్వభౌమ సోషలిస్ట్ లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర భారతి"కి పూర్ణ స్వరాజ్యం సిద్ధించినట్లు అయ్యింది. 26 నవంబర్ 1949న భారత రాజ్యాంగాన్ని పార్లమెంట్/ రాజ్యాంగ సభ ఆమోదించడం జరిగిందని మనకు తెలుసు. నేడు దేశం 75వ గణతంత్ర సంబరాలను ఘనంగా నిర్వహిస్తూ ప్రజల్లో దేశభక్తి భావనలను జాగృతం చేస్తున్నది. కరోనా మహమ్మారి కమ్మిన కారుమబ్బుల అకాలంలో కూడా ఇండియా కొంత నిగ్రహాన్ని ప్రదర్శించి, బయట పడి అభివృద్ధి దిశగా నడవడం సంతోషదాయకం. భారత భాగ్యాన్ని స్మరించుకుంటూ, మనల్ని వెంటాడుతున్న సమస్యలను గుర్తు చూసుకోవలసిన, సమాధానాలు శోధించవలసిన సందర్భమిది.

**ఏడున్నర దశాబ్దాల ప్రగతి వెలుగులు:**

అయోధ్యలో బాలరాముడు కొలువైన శుభ వేళ దేశమంతా రామనామంతో ప్రతిధ్వనిస్తోంది. గత ఏడున్నర దశాబ్దాలుగా స్వతంత్ర, గణతంత్ర భారతం అభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది. మరో వైపు దేశ నలుమూలల పలు ప్రధాన సమస్యల విష వలయాలు విస్తరిస్తూనే ఉన్నాయి. నేటి గణతంత్ర దినోత్సవ శుభసమయాన ప్రతి ఒక్కరు తాను ఎదుగుతూ దేశ సుస్థిరాభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవలసిన అగత్యం ఏర్పడింది. వ్యవసాయ ఉత్పత్తులు, శాస్త్ర సాంకేతికాభివృద్ధి ఫలాలు, ప్రపంచంలోనే నైపుణ్య యువ దేశంగా నిలవడం, మహమ్మారులను సమర్థవంతంగా ఎదుర్కోవడం, ప్రజారోగ్య ప్రగతి, విద్య వనరులు లాంటి పలు రంగాల్లో కొంత ప్రగతి సాధించామని అంగీకరించాల్సిందే. అంతరిక్ష పరిశోధనలు, డిజిటల్ యుగ పునాదులు, అంతర్జాతీయ గుర్తింపులు, పునరుత్పాదక శక్తి వనరులు, పారిశ్రామిక ప్రగతి రథ గమనాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విస్తరణలు, సర్వ శక్తివంతమైన త్రివిధ దళాలు, స్టార్టప్ సంచలనాలు, ఆర్థిక పటిష్టతలు, ఆటోమొబైల్ ఉరుకుల పరుగులు, వ్యవస్థీకృత సంస్కరణలు, కృత్రిమ మేధోయుగం వైపు పయనాలు లాంటి రంగాల్లో భారతం కొంత ప్రగతిని సాధించిందనటంలో అతిశయోక్తి కాదు.

**గణతంత్ర భారతి మెడలో సమస్యల మాలలు:**

నేటి గణతంత్ర సంతోష సమయంలో దేశాన్ని పలు సంక్లిష్ట సమస్యలు భారతాన్ని చుట్టుముడుతూ అభివృద్ధి నిరోధకాలుగా నిలుస్తునే ఉన్నాయి. దేశవ్యాప్తంగా అవినీతి మహమ్మారిలు విస్తరించడం, అధిక జనాభా విస్పోటనం, సురక్షిత నీరు ఇంకిపోవడం, వెర్రితలలు విసురుతున్న సామాజిక మాధ్యమాలు, రాక్షస నీచ రాజకీయాలు, నిరుద్యోగ దయ్యం, నిరక్షరాస్యత సంక్షోభం, కార్బన్ ఉద్గారాల చీకట్లు, పారిశుద్ధ్య కంపు, ప్రజారోగ్య తరుగు, పేదరిక సిండ్రోమ్, పలుచబడుతున్న సుపరిపాలనలు, రెచ్చిపోతున్న ప్రపంచీకరణ భూతం, భావ/పర్యావరణ కాలుష్య కోరలు విస్తరించడం, గాల్లో దీపాలైన మహిళా భద్రత, రెచ్చిపోతున్న అసమానతల భూతం, ఉత్తదవుతున్న ఉన్నత విద్య కలలు, మౌళిక వసతుల లోటు, రైతుల వెతలు, కూడు గూడు గుడ్డ కోసం హాహాకారాలు, శ్రమ దోపిడి శాపాలు, వలసల వెతలు లాంటి పలు తీవ్రమైన సమస్యలతో భరతమాత అనారోగ్యం పాలవుతున్నది. దీనికి తోడుగా కులాల కుళ్లు, మతాల మంటలు, ప్రాంతీయ గోడలు, ఉగ్రవాదుల ఉన్మాదాలు, భాషాదురభిమానాలు, మత్తులో తూగుతున్న యువత, వరకట్న పిశాచాలు, స్వార్థ పరంపరల ఊడలు, బడుగుల బహు వేదనలు, అనైతిక రాజకీయాలు, అత్యాచార హత్యల విష శృంఖలాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, లింగ భేదభావాలు, బక్కచిక్కిన బాలలు, స్థూలకాయ సుందరులు, విలువల పతనాలు, ప్రలోభాల వరదల ఎన్నికలు లాంటి గంభీరమైన సంక్లిష్ట సామాజిక సమస్యలతో భారతం సతమతం అవుతున్నది.

**రాజ్యాంగ అమలుకు కట్టుబడి:**

రాజ్యాంగ రచనకు ఏర్పాటు చేసిన కమిటీకి డా: బి ఆర్ అంబేడ్కర్ అధ్యక్షత వహించగా సభ్యులుగా డా: రాజేంద్ర ప్రసాద్, కె యం మున్షీ, మహమ్మద్ షాదుల్లా, మాధవరావు, గోపాల స్వామి అయ్యంగార్ లాంటి దిగ్గజాలు రాజ్యాంగ రచనలో భాగస్వాములైనారు. స్వాతంత్ర్య పోరాటంలో జీవితాలను అర్పించిన మహా దేశభక్తులను స్మరించుకుంటూ, నేటి సమస్యలను ఆకలింపు చేసుకుంటూ, విశ్వ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించడానికి ప్రతి ఒక్కరు కంకణబద్దులు కావడానికి సిద్ధపడదాం. మనం ఎదుగుతూనే సమాజ ఎదుగుదలకు సహకరిద్దాం. నవ్వుతూ నవ్వులను పంచుదాం. నవ యువత నైపుణ్య శక్తిగా మారాలి. శిలాజ ఇంధనాలకు స్వస్తి పలికి సాంప్రదాయేతర ఇంధనాలను వినియోగించాలి. శాంతి స్థాపనలో పౌరులు భాగస్వాములు కావాలి. అసమానతల తొలగింపులో ముందడుగు వేయాలి. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి. కులమత సామరస్యాన్ని పెంచి పోషించాలి. నైతికతను నమ్మి నడవాలి. అమ్మాయిలో అమ్మను దర్శించాలి. వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలి. అక్షరాస్యతను పరిపూర్ణం చేయాలి. అంతర్జాల వలలో చిక్కకుండా తెలివిగా వినియోగించుకోవాలి. 75వ గణతంత్ర దినోత్సవ శుభవేళ పౌరసమాజం సత్కార్యాల సాధనకు సత్వరమే ప్రతిజ్ఞ చేయాలి.

జై జవాన్ ; జై కిసాన్ ; జై విద్వాన్ ; జై అనుసంధాన్.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా కోడిరెక్క ఉమా శంకర్



ఖమ్మం, జజనవరి 25:(నేటి నిజం ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం నల్గొండ వరంగల్ ఎమ్మెల్సీ స్థానానికి పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో త్వరలో జరుగనున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లుగా విద్యావంతుడు, తెలంగాణ ఉద్యమకారుడు కోడిరెక్క ఉమా శంకర్ ఒక ప్రకటనలో తెలియచేశారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామ వాస్తవ్యులు కోడిరెక్క వెంకన్న-పద్మ దంపతుల కుమారుడు కోడిరెక్క ఉమా శంకర్, స్వస్థలం సూర్యాపేట జిల్లా అయినప్పటికీ జననం, విద్యాభ్యాసం, ఉద్యోగం ఖమ్మం జిల్లాలో స్థిరపడటం ఈ ఎన్నికల్లో కలిసి వచ్చే విషయం. విద్యాభ్యాసం, సమాజ సేవ ఎంఎస్సీ, బిఎడ్, ఎంఎస్.డబ్ల్యు డబుల్ మాస్టర్ డిగ్రీల్లో పట్టా పొంది గత 14 సంవత్సరాలుగా ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా అనుభవం ఉండటంతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం ఉమా శంకర్ అభిరుచి గతంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా పనిచేసినందు వల్ల ప్రైవేట్ అధ్యాపకులలో మంచి పేరు సంపాదించారు. ప్రస్తుతం యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షులుగా పని చేస్తుండటం వలన రిజిస్టర్డ్ యువజన, మహిళ సంఘాల మద్దతు ఉమా శంకర్ కె అంటున్నారు. సమాజ సేవలో భాగంగా తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ స్థాపించి యువతకు అవగాహన సదస్సులు ఉపాధి శిక్షణలు నిర్వహించినందుకు గాను కేంద్ర ప్రభుత్వ సంస్థ నెహ్రూ యువ కేంద్ర అధ్వర్యంలో 2022-2023 జిల్లా ఉత్తమ యువజన అవార్డును అందుకున్నారు. ఎన్ఎస్ఎస్ పిఓ గా ఎనిమిది సంవత్సరాలుగా పని చేస్తున్న ఉమాశంకర్ ఎన్నో సార్లు జిల్లా అధికారుల ప్రశంసలు అందుకున్నారు.

ఉద్యమ, రాజకీయ ప్రస్థానం 2009లో తెరాస అధినేత కేసీఆర్ ఖమ్మం నగరంలో పెవిలియన్ గ్రౌండ్ నందు కధనబేరి నిర్వహించిన సమయంలో కేసీఆర్ సమక్షంలో తెరాస పార్టీలో చేరి ఉద్యమంలో పాల్గొన్నారు. స్వతహాగా నాటి నల్లగొండ జిల్లా ప్రాంత వాస్తవ్యులు కావడం, తన బాబాయ్ కోడిరెక్క మురళి అప్పటికే తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం వల్ల ఆకర్షితులై తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవశ్యకతను గుర్తించి ఉద్యమంలో పని చేశారు. భవిష్యత్తుని సైతం పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా తెరాస పార్టీకి ఎల్లప్పుడూ క్రమశిక్షణ గల కార్యకర్తగా పేరు తెచ్చుకున్నారు. వివాహం కుటుంబ నేపథ్యం ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన కోడిరెక్క ఉమా శంకర్ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అవులూరి సౌమ్య రెడ్డిని 2011 సంవత్సరంలో కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు(కవలలు), ఇద్దరు చెల్లెళ్ళు, తల్లి గృహిణి, తండ్రి విశ్రాంత ఉద్యోగిగా(క్లర్క్) ఉండగా కరోనా వలన మరణించడం జరిగింది. కలిసివచ్చే విషయాలు ఎన్నో ఏళ్లుగా అధ్యాపకునిగా పని చేస్తుండటం, యువతలో మంచి పేరు ఉండటం, సేవ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, మూడు జిల్లాల్లో పట్టు సాధించే దిశగా పయనించడం కలిసి వచ్చే విషయాలు. అభిమానించే వ్యక్తులుఅంబేద్కర్, జిగ్నేష్ మేవని, జయప్రకాష్ నారాయణ, కేటీఆర్, పువ్వాడ అజయ్ కుమార్ నీ ఎక్కువగా అభిమనిస్తానని తెలియచేశారు. యువత రాజకీయాల్లోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అందుకే ఈ సారి ఉమ్మడి ఖమ్మం నల్గొండ వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని నన్ను అశీర్వదించవలసినదిగా మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను గెలిపించవలసినదిగా ఈ సందర్భంగా కోరారు.

# టీఎస్ఆర్టీసీ డిపోల్లో నాన్ ఇంజినీరింగ్ విభాగంలో అప్రెంటిస్ శిక్షణ ఖాళీల భర్తీ

హైదరాబాద్ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ టీఎస్ఆర్టీసీ డిపోల్లో నాన్ ఇంజినీరింగ్ విభాగంలో అప్రెంటిస్ శిక్షణ ఖాళీల భర్తీకి తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎస్ఆర్టీసీ) ప్రకటన విడుదల చేసింది.

దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీకాం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీసీఏ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు.. 2018 నుంచి 2023 మధ్య బ్యాచ్‌ల వారు అర్హులని తెలిపింది. దరఖాస్తు విధానం ఆన్‌లైన్‌లో ఉండగా.. ఫిబ్రవరి 16 వరకు అప్లయ్ చేసుకోవచ్చు.

పూర్తి వివరాలకి టీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్ సైట్ http://tsrtc.telangana.gov.in ని సంప్రదించాలని సూచించింది. మొత్తం ఖాళీలు: 150.

పోస్టులు: నాన్ ఇంజినీరింగ్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్

అర్హతలు: బీకాం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీసీఏ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణత. 2018 నుంచి 2023 మధ్య బ్యాచ్‌ల వారు అర్హులు

అప్రెంటిన్‌షిప్ పీరియడ్: మూడేండ్లు

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో

చివరితేదీ: ఫిబ్రవరి 16

వెబ్‌సైట్: https://www.tsrtc.telangana.gov.in

# బీసీల సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టండి..


### – ముఖ్యమంత్రికి దాసు సురేష్ లేఖ, మంత్రి పొన్నంతో సమావేశం..



హైదరాబాద్ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దశాబ్దకాలంగా తెలంగాణలో అపరిష్కృతంగా ఉన్న బీసీ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయానికి గతవారం నివేదికను సమర్పించామని అట్టి విషయాలపై బీసీ మంత్రి పొన్నంప్రభాకర్ తో భుదవారం సమావేశమయ్యామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ భుదవారం సెక్రటేరియట్ లోని మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో బీసీలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసినలేఖలో సమగ్రంగా వివరించామని దాసు సురేష్ పేర్కొన్నారు.కేసీఆర్ ప్రభుత్వం కో ఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 19 శాతానికి తగ్గించి బీసీ కార్పొరేషన్లు ఫెడరేషన్లకు పాలకమండళ్లను నియమించకుండా బీసీ నాయకత్వాన్ని అడుగడుగునా అణచివేసిన వైనాన్ని వివరించామన్నారు. ప్రభుత్వం త్వరలో ప్రకటించబోయే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత నివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లేఖలో కోరారు. మంత్రి పొన్నంప్రభాకర్ తో జరిగిన సమావేశంలో తెలంగాణలో బీసీల జనగణన, బీసీ డిక్లరేషన్ అమలు బీసీల విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలపై చర్చించామని దాసు సురేష్ మీడియాకు వివరించారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న బీసీ గురుకులాలకు సొంత భవనాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. విద్యపై బడ్జెట్ కేటాయింపులను కేసీఆర్ ప్రభుత్వం క్రమంగా తగ్గించడాన్ని సంఖ్యావరంగా మంత్రికి వివరించారు. 2014 -15-వార్షిక బడ్జెట్ లో 10 .89 శాతం విద్య కోసం వెచ్చించగా 2022 -23 నాటికి బడ్జెట్లో కేవలం6 .24 శాతం మాత్రమే వెచ్చించి ప్రైవేట్ యూనివర్సిటీలకు తెరతీసిందన్నారు. తద్వారా బీసీ ఎస్సీ ఎస్టీలు రిజర్వేషన్లను కోల్పోయి విద్యకు దూరమయ్యారన్నారు. కొత్తగా ప్రారంభమైన ప్రైవేట్ యూనివర్సిటీలలో బీసీలకు రిజర్వేషన్లు సాధ్యమయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్సును జారీ చెయ్యాలని మంత్రిని దాసు సురేష్ కోరారు.బీసీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని త్వరలోనే బీసీ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారని దాసు సురేష్ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షులు దొంత ఆనందం , గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు భండారి పద్మావతి , ప్రధాన కార్యదర్శి ప్యారసాని దుర్గేష్ , గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ బింగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ భూమి దొంగల పాలు!

- కబ్జాకోరులకు అంధికారుల అండ
- సహకరిస్తున్న కార్యాలయ సిబ్బంది
- అధికారులతో కుమ్మకై పేదల పొట్ట కొడుతున్న ఓ ప్రబుద్ధుడు
- ఖమ్మం కార్పొరేషన్ కు కూతవేటు దూరంలో యాపారం
- ఆ భూములను కాపాడాల్సిందెవరు?
- రెవెన్యూ అధికారులా..? మండల అధికారులా?
- మా డ్యూటీ కాదంటే మాదికాదని తప్పించుకుంటున్న వైనం
- ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతున్న కొందరు అక్రమార్కులు
- నాన్ జ్యూడిషియల్ స్టాంపుల ద్వారా అమ్మకాలు
- ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని ఆఫీసర్లు
- నూతన ఇళ్ల నిర్మాణాలకు మామూళ్లు అందుకుంటున్న వైనం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే కిందిస్థాయి అధికారులను ఆదేశిస్తున్నారే తప్ప చర్యలు శూన్యం



ఖమ్మం, జజనవరి 25:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు అమ్ముకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. అత్యంత విలువైన భూములపై కన్నేసిన కొందరు వ్యక్తులు అప్పనంగా అమ్మేసుకుంటూ సొమ్ముచేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని జనం మండిపడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి...ఖమ్మం కార్పొరేషన్ కి కూతవేటు దూరంలో సుమారు కొన్ని ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అత్యంత విలువైన ఈ భూమిపై కొందరి కన్ను పడింది. ప్రస్తుతం రఘునాథపాలెం మండల సమీపంలో ఉన్నటువంటి కెసిఆర్ కాలనీ, పువ్వాడ ఉదయ్ నగర్ పరిధి నందు ప్రభుత్వ భూమిలో సుమారు ఒక ప్లాట్ భూమికి మూడు నుంచి ఐదు లక్షల రూపాయలు చొప్పున నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ ద్వారా అమ్మకానికి పాల్పడుతున్నారని ప్రజలు పలుమార్లు జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, జిల్లా అధికారులకు ఫిర్యాదులు సైతం చేశారు. ఈ విషయంలో విచారణ నిమిత్తం కలెక్టర్ పేషీ నుంచి లేఖల ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దార్ కార్యాలయాలకు జిల్లా స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు మామూళ్లకు అలవాటు పడిన కింది స్థాయి అధికారులు ప్రభుత్వ స్థలాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోక నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఆ స్థలాల్లో నూతనంగా భవనాలు నిర్మిస్తున్నారని, అక్రమంగా స్థలాల అమ్మకాలు జరుపుతున్నారని ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. మండల కార్యాలయం వారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని వాళ్ళు ఎంక్వయిరీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటారని బుకాయిస్తారు. ఇక

తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లితే అక్కడ అధికారులు పోలీసు అధికారులకు లేఖలు వ్రాసినమని తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు మామూళ్లకు అలవాటు పడడం వల్లనే ఒకరిపై మరొకరు నెపం వేసుకుంటూ చర్యలు తీసుకోకుండా తప్పించుకు ంటున్నారని అర్థమవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా అధికారులు ఒకరికొకరు సహకరిం చుకుంటూ ప్రభుత్వ భూములను కాపా డడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న సొమ్ము నుంచి లక్షల్లో నెల నెల జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రభుత్వ భూములు కాపాడకుండా చోద్యం చూస్తుండడంపై జనం మండిపడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి ప్రభుత్వ భూమిని కాపాడాలని, అక్రమంగా అమ్ముతున్న వారిపై...ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇజ్రాయెల్ వైఖరి ప్రపంచ శాంతికి ముప్పు

### – నెతన్యాహు తన వైఖరి మార్చుకోవాలి.. ఐక్యరాజ్యసమితి

న్యూ డిల్లీ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటును ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యతిరేకించడాన్ని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ తప్పుబట్టారు. నెతన్యాహు వైఖరి ప్రపంచ శాంతికి ముప్పు అని వ్యాఖ్యానించారు. నెతన్యాహు తన వైఖరి మార్చుకోకపోతే.. ప్రపంచ శాంతికి సవాల్ విసురుతున్న ఇరు దేశాల వివాదం సుదీర్ఘకాలం కొనసాగే ప్రమాదం ఉందన్నారు. చాలాచోట్ల తీవ్రవాద సంస్థలు పుట్టుకు రావొచ్చని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో గుటెరస్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పాలస్తీనా ప్రజల స్వతంత్ర దేశ ఏర్పాటు హక్కును ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిందే. రెండు దేశాల ఏర్పాటు పరిష్కారాన్ని ఎవరు అంగీకరించకపోయినా ఆ నిర్ణయాన్ని తిరస్కరించాల్సిందే. ఎలాంటి స్వతంత్రం, హక్కులు, గౌరవం లేకుండా అంతమంది పాలస్తీనా ప్రజలు ఒక ప్రాంతంలో ఉండటం అసలు ఊహించలేం' అని గుటెరస్ అన్నారు.సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న హమాస్ మిలిటెంట్ లు-ఇజ్రాయెల్ సేనల ఘర్షణలు ప్రాంతీయంగా అల్లకల్లోలానికి దారితీస్తాయనే అంచనాలు నిజమవుతున్నాయని గుటెరస్ ఆందోళన వ్యక్తంచేశారు. అందుకు ఇటీవల లెబనాన్, యెమెన్, సిరియా, ఇరాక్, పాకిస్థాన్ దేశాల్లో జరిగిన దాడులను ఆయన ఉదహరించారు. ఇరు పక్షాలు వెంటనే కాల్పుల విరమణ పాటించాలని సూచించారు.

# తను పార్టీ మారుతున్నట్లు వస్తున్న కథనాలు అవాస్తవం

### – ఖండించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి

హైదరాబాద్ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తను పార్టీ మారుతున్నట్లు వస్తున్న కథనాలు అవాస్తమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు మీడియా సమావేశంలో మాట్లాడారు. మెదక్ జిల్లా సమస్యలు వివరించేందుకే నిన్న సీఎం రేవంత్‌రెడ్డి ని కలిశామన్నారు. పార్టీ మారుతున్నారని కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని స్పష్టం చేశారు.కాగా, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) ఇవ్వాలని ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎఫ్‌తోపాటు ప్రొటోకాల్ ఉల్లంఘన, గన్‌మెన్ల కుదింపు తదితర అంశాలను సీఎం దృష్టికి తీసికెళ్లినట్టు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మీడియాకు వివరించారు. ఎస్‌డీఎఫ్ అర్ధాంతరంగా నిలిపివేయడం వల్ల అభివృద్ధి పనులు జరగడం లేదని పేర్కొన్నారు.ప్రొటోకాల్ పాటించకుండా తమను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. సీఎంను కలిసిన వారిలో తనతోపాటు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఉన్నారని చెప్పారు. అంతకుముందు గన్‌మెన్ల కుదింపు అంశాన్ని ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డిని కలిసి వివరించినట్టు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

# నివాస ప్రాంతంలోకి దూసుకెళ్లిన బస్సు... తప్పిన ప్రమాదం..


అమరావతి, జనవరి 25:ఏలూరు జిల్లా పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ చెందిన సిద్ధార్థ విద్యాలయ స్కూల్ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది.

మెయిన్ రోడ్ లో ప్రయాణిస్తున్న సమయంలో రోడ్డు పక్కనే ఉన్న ఒక నివాస ప్రాంతంలోకి దూసుకెళ్లింది. నివాస ప్రాంతాలకు చెందిన ఇల్లు దెబ్బతింది. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈఘటన పై డ్రైవర్‌ను ఆరా తీయగా ఎదురుగా ఉన్న వాహనం తప్పించబోయే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపాడు

# సెక్యూలర్ అని చెప్పుకునే వారు బీజేపీకి ఊడిగం చేస్తున్నారు

### – తీవ్రస్థాయిలో మండిపడ్డ సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ, జనవరి 25:దేశంలో రాజకీయ పరిస్థితులు ఆందోళనకరంగా మారాయని, రాజకీయాలకు సంబంధం లేకుండా ఒక మతాన్ని పెంపొందించారని, కాబినెట్‌లో కూడా మతాన్ని రాజకీయం చేశారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. సెక్యూలర్ అని చెప్పుకునే వారు బీజేపీకి ఊడిగం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఈ సందర్భంగా గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఏ రాజ్యాంగానికి లోబడి ఎన్నికయ్యారో దానికి మూడు నామాలు పెట్టారని, మతం, రాజకీయం ఒకటి చేశారని ఆరోపించారు. అయోధ్య రామాలయం నిర్మాణంకు తాము వ్యతిరేకం కాదని, అన్ని ఊర్లలో రామాలయాలు ఉన్నాయన్నారు. అయోధ్యలో ఒక ఈవెంట్ లాగా రామాలయంను మోదీ, యోగి ఓపెనింగ్ చేశారని విమర్శించారు.బాబ్రీ మసీదు ఘటనలో అద్వానీ ఉన్నారని, అలాంటి అద్వానీ రామాలయం ప్రారంభోత్సవానికి రాలేదని, బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని నారాయణ విమర్శించారు. ప్రపంచం మొత్తం బాబ్రీ మసీదు కులగొట్టిన అంశాన్ని చూశారని, అయోధ్య తీర్పు ఇచ్చిన వారిలో ఒకరు రాజ్యసభలో, మరొకరు ఏపీ గవర్నర్‌గా ఉన్నారన్నారు. అయోధ్య రామాలయం ప్రారంభానికి రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా విశాలంగా ఆలోచన చేయాలన్నారు. మోదీ బ్లాక్ మెయిల్‌తో కొందరు వెనక్కి వెళున్నారన్నారు. కాంగ్రెస్ ఇంకా అందరినీ కలుపుకొని పోవాలని అన్నారు



# తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులుగా స్వీపర్, మొబైల్ టాయిలెట్ నిర్వాహకురాలు

హైదరాబాద్ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: 75వ గణతంత్ర దినోత్సవం కోసం యావత్ భారత్ సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో ఎర్రకోటపై మువ్వన్నెల జెండా రెపరెపలాడనుంది. ఈ సారి 1500 మంది రైతులు వేడుకలకు హాజరవుతారు. ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వస్తున్నారు. ఎప్పటిలాగే శకటాల ప్రదర్శన, వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలు రిపబ్లిక్ డే వేడుకలకు అటెండ్ అవుతారు. వారిలో ఒకరు స్వీపర్ నారాయణమ్మ కాగా మరొకరు మొబైల్ షీ టాయిలెట్ నిర్వాహకురాలు నాగలక్ష్మి. వీరిద్దరిని రిపబ్లిక్ డే వేడుకల కోసం జీహెచ్ఎంసీ అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులుగా ఢిల్లీ పంపించారు.

### నారాయణమ్మ

నారాయణమ్మ స్వస్థలం రంగారెడ్డి జిల్లా యాచారం. గత 22 ఏళ్లుగా గ్రేటర్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. బంజారాహిల్స్ కాలనీల్లో నిత్యం రోడ్లను ఊడుస్తుంటారు. సమయం దొరికితే చాలు భజన, భక్తి కార్యక్రమాలకు హాజరవుతారు. జానపద గీతం, రామాయణ, భారతాలను పాటలుగా పాడతారు. వేమన పద్యాల నుంచి సంస్కృత పద్యాలు చెబుతారు. నారాయణమ్మ గాత్రం విని ఎవరైనా ఫిదా కావాల్సిందే. అలాంటి నారాయణమ్మ ఈ సారి రిపబ్లిక్ డే వేడుకల్లో తెలంగాణ ప్రతినిధిగా హాజరవుతారు.

### నాగలక్ష్మి

సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన నాగలక్ష్మి. ఈమె రెండు డిగ్రీలు చేశారు. గత ఐదేళ్ల నుంచి కోదాడలో మొబైల్ టాయిలెట్ నిర్వాహకురాలిగా సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు ఆటోకు బిగించిన టాయిలెట్‌ను ఊరంతా తిప్పుతారు. గుడి వద్ద, బస్టాండ్ దగ్గర, మార్కెట్ వద్ద మొబైల్ టాయిలెట్ ఉంచుతారు. మొబైల్ టాయిలెట్ వాడుకున్న వారి నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోరు. ఉచితంగా సేవ అందిస్తున్నారు.

### ఐదుగురు సర్పంచ్‌లకు ఆహ్వానం

రిపబ్లిక్ డే వేడుకలకు ఐదుగురు మహిళా సర్పంచ్‌లకు కూడా ఆహ్వానం వచ్చింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఐదుగురికి పిలుపు వచ్చింది. ఖమ్మం జిల్లాకు చెందిన పాపిశెట్టి శైలజ, ములుగుకు చెందిన ఎం అనితారాణి, నాగర్ కర్నూలుకు చెందిన పి సురేఖ, సంగారెడ్డికి చెందిన బక్క రమాదేవి, వికారాబాద్‌కు చెందిన కాంతి లక్ష్మి ఉన్నారు. వీరంతా తమ భర్తలతో కలిసి వేడుకలకు రావాలని ఆహ్వానించారు.

# హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. బుధవారం హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాల కృష్ణ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. శివ బాలకృష్ణపై ఆదాయం మించి ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. ఈ క్రమంలో ఈరోజు ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 20 ప్రాంతాల్లో సోదాలు జరుగుతున్నాయి. అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు చేస్తోంది. శివ బాలకృష్ణ ఇళ్లు, బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. శివ బాలకృష్ణ తన పదవిని అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు సంపాదించినట్లుగా ఏసీబీ గుర్తించింది. హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో బాలకృష్ణ కీలక స్థానంలో పనిచేసిన విషయం తెలిసిందే.

# మెహదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం

న్యూ ఢిల్లీ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఒక గుడ్ న్యూస్ చెప్పింది. మెహదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికిగాను భూకేటాయింపునకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మెహదీపట్నంలో రక్షణ శాఖకు చెందిన 3,380 చదరపు గజాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర అప్పగించనుంది. అయితే.. ఇక్కడే కేంద్రం ఒక కండీషన్ పెట్టింది. ఆ భూములు ఇచ్చినందుకు గాను రక్షణ శాఖకు రూ.15.15 కోట్ల మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి షరతు విధించింది. అలాగే.. కొంత స్థలానికి పదేళ్ల లైసెన్స్ రుసుం చెల్లించాలని పేర్కొంది. నాలుగు వారాల్లోనే ఈ భూముల్ని అప్పగించేలా కేంద్ర రక్షణ శాఖ అంగీకారం తెలిపింది. ఇదిలా వుండగా.. మెహదీపట్నంలో రోడ్డు దాటేందుకు పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండటంతో, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాంతంలో స్కైవాక్ నిర్మించాలని నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఈ స్కైవాక్‌ని ప్రతిపాదించగా.. మూడేళ్ల క్రితం రూ.34.28 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అయితే.. తమ భూముల్లో పనులు చేస్తున్నారని రక్షణ శాఖ అడ్డుకోవడంతో, ఈ స్కైవాక్ పనులు ఆగిపోయాయి. ఈ పనుల్ని పునఃప్రారంభించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది కానీ, ఎందుకో ముందుకు సాగలేదు. ఇప్పుడు రక్షణ శాఖ భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలపడంతో, ఈ పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

# 'వై నాట్ 175' వెనుక దొంగ ఓట్ల కుట్ర: పురందేశ్వరి

విజయవాడ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మరో 2, 3 నెలల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో దొంగ ఓట్ల వ్యవహారం ఏపీ రాజకీయాలను కుదిపేస్తోంది. నకిలీ ఫామ్-7 దరఖాస్తులపై ఇప్పటివరకు 70 కేసులు నమోదయ్యాయి. ఏడాదిలో 30 లక్షల దొంగ ఓట్లను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తొలగించారు. అధికార వైసీపీ కుట్ర ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి దొంగ ఓట్లపై సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రతి సందర్భంలో సీఎం జగన్ 'వై నాట్ 175' అంటున్న సంగతి తెలిసిందే. దాని వెనక దొంగ ఓట్ల ద్వారా లబ్ది పొందాలనే కుట్ర దాగి ఉందని పురందేశ్వరి అన్నారు. విజయవాడలో బుధవారం 'గావ్ ఛలో అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో అధికార వైసీపీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. అందుకోసమే వచ్చే ఎన్నికల్లో విజయంపై ధీమాతో ఉన్నారని వివరించారు.

35 వేల దొంగ ఓట్లు

తిరుపతి ఉప ఎన్నిక సమయంలో 35 వేల దొంగ ఓట్లు వేయించారని పురందేశ్వరి ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అలాగే చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ కుట్రలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేసిందని పురంధేశ్వరి వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పలు పనులను ఏపీ సర్కార్ చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తుల అంశాన్ని హైకమాండ్ చూసుకుంటుందని స్పష్టంచేశారు.

# అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ మహోత్సవం వేళ...

## -బాధ్యతలను విస్మరించిన తెలంగాణలో ఎండోమెంట్ శాఖ

## -బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శ

హైదేర్రాబాద్ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవం జరుగుతున్న వేళ తెలంగాణలో ఎండోమెంట్ శాఖ నిర్వహించాల్సిన బాధ్యతలను పూర్తిగా విస్మరించిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ సంప్రదాయం, సంస్కృతికి సంబంధించి కార్యక్రమాలను నిర్వహించకుండా ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎండోమెంట్ శాఖ విధులు నిర్వహించడంలో జరిగిన వైఫల్యాలను రాష్ట్ర గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామని ఆయన వెల్లడించారు. మూసీ సుందరీకరణ విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే అమలుకు నోచుకోని హామీలు వల్లెవేస్తోందని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంట్రాక్టర్లే నడిపిస్తున్నారంటూ మండిపడ్డారు. మొదటి మాసంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుంచి జరిగిన నిధుల చెల్లింపుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి భక్తులు, ప్రజలు తరలివచ్చారు.బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవం కోసం ప్రపంచంలోని నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి అనేక దేశాల నుంచి భారతీయ సంస్కృతికి సంబంధించిన క్షేత్రాల నుంచి వస్త్రాలు, ఆభరణాలు, మట్టి పంపించారు.అయోధ్యలో జరిగిన ఆధ్యాత్మిక క్రతువు భారతీయ ఆత్మగౌరవానికి, హిందువుల మనోభావాలకు ప్రతీకగా జరిగింది. కాని, తెలంగాణ ప్రభుత్వంలోని ఎండోమెంట్ శాఖ అందుకు భిన్నంగా వ్యవహరించిందన్నారు. హిందూ సంప్రదాయం, సంస్కృతికి సంబంధించి కార్యక్రమాలను నిర్వహించకుండా ప్రజల మనోభావాలను దెబ్బతీసింది.భారత రాజ్యాంగం మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఎండోమెంట్ శాఖ, మైనారిటీ వెల్ఫేర్ శాఖలు ఉన్నాయి.ఎండోమెంట్ శాఖకు కమిషనర్, మంత్రి, ప్రిన్సిపల్ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన వ్యవహారంలో అంతర్భాగంగా విధులు నిర్వహిస్తున్నారు.ప్రధాన పండుగలు, సందర్భాలు వచ్చినప్పుడు మైనారిటీ వెల్ఫేర్ శాఖ ఆ వర్గాలకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అదేవిధంగా ఎండోమెంట్ శాఖ తమ విధులు నిర్వర్తించాలి.ఎండోమెంట్ శాఖ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలి. ఎండోమెంట్ నిధులను ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు నిధులను ఖర్చు చేయడం సంప్రదాయ మన్నారు. అయోధ్యలో మహత్తరమైన బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవం జరుగుతున్నప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎండోమెంట్ శాఖ, అధికార యంత్రాంగం సహాయ నిరాకరణకు పాల్పడ్డారు. పట్టింపు లేకుండా వ్యవహరించారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన.హిందువుల కోసం, వారి మనోభావాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఎండోమెంట్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం హేయనీయం.కుహనా లౌకికవాద కాంగ్రెస్ ప్రభుత్వం ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడంలో ఘోర వైఫల్యం చెందింది. హిందువుల మనోభావాలను దెబ్బతీసింది .హిందువుల ఆచార వ్యవహారాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన తీరుకు తెలంగాణ ఎండోమెంట్ శాఖ మంత్రి క్షమాపణ చెప్పాలి.రాజ్యాంగబద్ధంగా ఎండోమెంట్ శాఖ విధులు నిర్వహించడంలో జరిగిన వైఫల్యాలను రాష్ట్ర గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

నిన్న సీఎం రేవంత్ రెడ్డిని నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడం వెనుక మతలబేంటి..?విదేశీ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ ను పాతరేస్తానని మాట్లాడిన రేవంత్ ను అభినందించేందుకు కలిశారా..? కేసీఆర్ ను పరామర్శించేందుకు తన ఇంటికి కాంగ్రెస్ నాయకులు పరామర్శలకు క్యూలైన్లు కట్టారు. ఇది బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం.. అనుబంధం.. సంబంధం. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీని సుందరీకరణ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పింది. గతంలో కేసీఆర్ సైతం ట్యాంక్ బండ్ ను కొబ్బరినీళ్లతో నింపుతామని మాటలు చెప్పారు.పదేళ్లు గడిచినా ట్యాంక్ బండ్ లో కొబ్బరినీళ్లలా చేసింది లేదు. మూసీ సుందరీకరణ విషయంలో బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది కాంట్రాక్టర్లే.బ్యాంకు రుణాల ద్వారా ప్రాజెక్టులు చేపట్టి అందినంత మేరకు దండుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. బీఆర్ఎస్ పంథాలోనే కాంగ్రెస్ పయనిస్తోంది.ఇప్పటికే అప్పుల్లో మునిగిన రాష్ట్రంలో కాంగ్రెస్ 6 గ్యారంటీల అమలు కోసం కొత్తగా అప్పులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఆగిన కాంట్రాక్టర్ల బకాయిలు, ఆగిన బిల్లులను మొదటి మాసంలో చెల్లించింది.మొదటి మాసంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుంచి జరిగిన నిధుల చెల్లింపుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేసారు.

# నా రాజీనామా ఆమోదం చెల్లదు: గంటా శ్రీనివాస్‌రావు

అమరావతి జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: విశాఖ స్టీల్ పరిరక్షణకు మూడు సంవత్సరాల క్రితం తాను ఎమ్మెల్యే పదవికి చేసిన రాజీనామాను ప్రస్తుత పరిస్థితుల్లో స్పీకర్ ఆమోదించడం సాంకేతికంగా చెల్లదని టీడీపీ నాయకుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. రాజీనామాను స్పీకర్ ఆమోదించడంపై న్యాయనిపుణులతో చర్చిస్తున్నానని వెల్లడించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో మూడు సీట్లను కైవం చేసుకోవడానికి వైసీపీ పన్నిన కుట్రలో భాగంగానే తన రాజీనామాకు నేడు ఆమోదం తెలుపడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు సీట్లు గెలిచేందుకు వైసీపీకి అవకాశాలుండగా మూడో స్థానాన్ని టీడీపీకి దక్కకుండా చేయడానికి రాజకీయ విలువలను పక్కన పెట్టి రాజీనామాను ఆమోదించారని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను రద్దు చేయాలని సీఎం వైఎస్ జగన్ ఏనాడు కూడా ప్రధాని మోదీతో మాట్లాడక పోవడం వల్ల వేలాది మందికార్మికులు, ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. తనపై ఉన్న కేసుల నుంచి తప్పించుకోవడానికే ప్రధానితో జగన్ గట్టిగా మాట్లాడలేక పోయారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని విశాఖ బ్లాస్ట్ ఫర్నేస్‌లో వేసేందుకు జనం సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.

# వృద్ధులు,వికలాంగులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంప్




హైదరాబాద్ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ హెల్త్ క్యాంప్ ఇంచార్జ్ వీరమణి (ఎం.సీ మెంబర్ ) ఆధ్వర్యంలో యాకూత్ పుర లో, యాకుత్ మహల్ థియేటర్ దగ్గర , సీమ మహిళా మండలి సహకారం తో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు మరియు వికలాంగులకు, తెలంగాణ ప్రభుత్వ వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ సంయుక్తంగా నిర్వహిస్తున్న మొబైల్ మెడికేర్ యూనిట్ (ఓఓజ) లో భాగంగా ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గెలాక్సీ హాస్పిటల్ డాక్టర్ అమీర్ మెహది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ యం సి సభ్యులు జ్యోతి,మెడికల్ హెల్త్ క్యాంప్ కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి, గెలాక్సీ హాస్పిటల్ డా. అలీ, పార మెడికల్ డైరెక్టర్ హుసాముద్దీన్, బండ్ల గూడ మండల కన్వీనర్ రాకేష్, సీమ మహిళా మండలి సభ్యులు షామీమ్ సుల్తాన, సుల్తానా బేగం, అహ్మదీ బేగం, దొంతి శిల్పారెడ్డి, సుజాత లక్ష్మీ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# తెలంగాణలో నేవీ రాడార్ స్టేషన్

## -దామగూడెం ఫారెస్ట్ లో 1174 హెక్టార్ల భూముల బదిలీ

## - సీఎం రేవంత్ రెడ్డితో తూర్పు నావికా దళం అధికారుల భేటీ



హైదరాబాద్ జనవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);భారత నావికా దళం తెలంగాణను కీలక స్థావరంగా ఎంచుకుంది. దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ను వికారాబాద్ జిల్లాలో నెలకొల్పుతోంది. నౌకలు, జలాంతర్గాములతో సంభాషించేందుకు నావికా దళం వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్ స్టేషన్ ను ఉపయోగిస్తుంది. వికారాబాద్ మండలం పూడూరు సమీపంలోని దామగూడెం అటవీ ప్రాంతంలో ఈ స్టేషన్ ఏర్పాటు చేయనుంది. దేశంలోనే ఇది రెండో స్టేషన్. తమిళనాడులోని తిరునెల్వేలిలో ఉన్న ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మొట్ట మొదటిది. 1990 నుంచి అది నావికా దళానికి సేవలందిస్తోంది. రెండో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ ఇప్పటికే గుర్తించింది. 2010 నుంచి నావికా దళం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. పర్యావరణ అనుమతులు, క్లియరెన్స్ లన్నీ వచ్చినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా భూముల కేటాయింపు ముందుకు సాగలేదు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. కమోడోర్ కార్తీక్ శంకర్, సర్కిల్ డీఈవో రోహిత్ భూపతి, కెప్టెన్ సందీప్ దాన్ బుధవారం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డిని కలిశారు. వికారాబా ద్ డీఎఫ్ వో, నావల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు అటవీ భూముల బదిలీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1174 హెక్టార్ల అటవీ భూమిని నేవీకి అప్పగించారు. 2014లోనే కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నేవీ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అటవీ భూమి అప్పగించేందుకు రూ.133.54 కోట్ల కాంపా నిధులు, భూసంరక్షణ చర్యలకు చేపట్టే పనులకు రూ.18.56 కోట్లను నేవీ చెల్లించింది. ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని కోరుతూ దామగూడెం ఫారెస్ట్ ప్రొటెక్షన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన షరతులకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రతిపాదించిన అటవీ ప్రాంతంలో ఒక ఆలయం ఉంది. దీనికి ఇబ్బంది తలెత్తకుండా చూడటం, ఇతరులను అనుమతించేందుకు నేవీ అంగీకరించింది. ఇక్కడ నేవీ స్టేషన్ తో పాటు ఏర్పడే టౌన్‌షిప్‌లో స్కూళ్లు, హాస్పిటళ్లు, బ్యాంకులు, మార్కెట్లు ఉంటాయి. ఈ నేవీ యూనిట్ లో దాదాపు 600 మంది నావికాదళంతో పాటు ఇతర సాధారణ పౌరులుంటారు. దాదాపు 2500 నుంచి 3000 మంది ఈ టౌన్‌షిప్‌లో నివసిస్తారు. విస్తృతంగా మొక్కలు నాటి పెంచడం ద్వారా ఈ ప్రాంతంలో జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తగిన చర్యలు చేపడుతారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే దామగుండం రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ దాదాపు 27 కి.మీ రోడ్డు నిర్మిస్తారు. 2027లో ఈ కొత్త వీఎల్ఎఫ్ సెంటర్ పూర్తవనుంది.

# మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అరెస్టుతో జీహెచ్ఎంసీ, అధికారుల్లో టెన్షన్

హైదరాబాద్, జనవరి 25: హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అరెస్టు, విచారణ.. పలువురు అధికారులను ఉలిక్కిపడేలా చేసింది. ఆయన అరెస్ట్ తో జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, సీడీఎంఏ అధికారుల్లో టెన్షన్ మొదలైంది. బాలకృష్ణ ప్రలోభాలకు గురైన అధికారుల్లో గుబులు మొదలైయినట్లు తెలుస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలోని బాలకృష్ణ అనుమతి ఇచ్చిన ప్రాజెక్టులకు క్లియర్ చేసిన ఏఎంయూడీ అధికారులూ భయపడిపోతున్నారు.కాగా.. మార్చి నెలాఖరులో ఇద్దరు అధికారులు రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి నుంచి సెలవుపై విదేశాలకు వెళ్లేందుకు ఆ ఇద్దరు అధికారులు ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం. అయితే బాలకృష్ణ విచారణ తర్వాత మరికొందరి పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటి ఎంఏయూడీ ఉన్నత అధికారి కనుసన్నల్లోనే బాలకృష్ణ ఉన్నారని.. స్వామి కార్యం స్వకార్యం రెండూ చేసుకున్నట్లుగా గుర్తింపు ఉన్న నేపథ్యంలో ఆ ఉన్నతాధికారి పాత్రపైనా ఏసీబీ ఆరా తీస్తున్న పరిస్థితి. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక సదరు అధికారిని ఎంఏయూడీ ఉన్నత పదవి నుంచి గుర్తింపులేని శాఖకు ఇటీవలే సర్కార్ బదిలీ చేసినట్లు సమాచారం.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

## -తొప్పూర్ ఘాట్ రోడ్ వద్ద ఓ వంతెనపై మూడు ట్రక్కులు, రెండు కార్లు ఢీ

## - నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం

చెన్నయ్ జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ధర్మపురి జిల్లాలోని తొప్పూర్ ఘాట్ రోడ్ వద్ద ఓ వంతెనపై బహుళ వాహనాలు ఢీకొన్నాయి. మూడు ట్రక్కులు, రెండు కార్లు ఢీకొనడంతో.. నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పొందారు. మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలవ్వగా.. చికిత్స నిమిత్తం వారిని వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. ఒళ్ళు గగుర్పొడిచే ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకోగా.. సీసీటీవీ కెమెరాలో దృశ్యాలు రికార్డ్ అయ్యాయి.ఆ వీడియోని గమనిస్తే.. వేగంగా దూసుకొస్తున్న ఈ ట్రక్కు ఎదురుగా వెళ్తున్న రెండు ట్రక్కులను ఢీకొంది. దీంతో.. ఒక ట్రక్కు అదుపు తప్పి వంతెనలో పడిపోయింది. ఈ మూడు ట్రక్కుల మధ్య వెళ్తున్న ఒక కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఇంతలోనే ఓ ట్రక్కుకు మంటలు అంటుకున్నాయి. మరోవైపు.. ఈ ప్రమాదంలో అనుసరిస్తున్న మరో కారు కూడా ధ్వంసం అయ్యింది. ఫలితంగా.. ఇద్దరు మహిళలతో కలిపి మొత్తం నలుగురు మృతి చెందారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అలాగే.. గాయాలైన వారికి రూ.50 వేల సహాయాన్ని అందజేశారు.ఈ ఘటనపై ధర్మపురి డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ స్పందిస్తూ.. పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ నేషనల్ హైవే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయన్న భయంతోనే తాము తొప్పూర్ ఘాట్ సెక్షన్ వద్ద మంజూరైన ఎలివేటెడ్ హైవేని సత్వరమే అమలు చేయాలని పట్టుబడుతున్నామని ఆయన అన్నారు.

# ఎన్నికల శంఖారావానికి సంసిద్ధం.. వైవీ సుబ్బారెడ్డి




అమరావతి, జనవరి 25:ఎన్నికల శంఖారావానికి సంసిద్ధం అవుతున్నామని పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్సీపీ ఉత్తరాంధ్ర రీజియన్ పరిధిలోని నాయకులు, ప్రజా ప్రతినిధులను రానున్న ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఈ నెల 27వ తేదీన భీమిలి నియోజకవర్గంలోని సంగివలసలో సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈసభలో వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొని నాయకులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయడం ద్వారా భీమిలి నుంచి ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుడతారని తెలిపారు. గురువారం శ్రీకాకుళం జిల్లా వైస్సార్సీపీ కార్యాలయం ఆవరణలో జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు మరోసారి తెలియజేసి వారిని ఉత్తేజితులను చేయడమే ఈ సభ ఉద్దేశమని చెప్పారు.

ఈ సభలో ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఐదు వేలు చొప్పున రెండు లక్షల మంది వరకు ప్రజాప్రతినిధులు, గృహ సారథులకు స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. ఇలాంటి సభలే రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగుచోట్ల నిర్వహిస్తామన్నారు. వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, సీఎం జగన్ ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చూడుతుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కూడా విజయం మనదేనని అందువల్ల మరింత ఉత్సాహంతో పార్టీ శ్రేణులు ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా ఇంఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఈ సభ చారిత్రాత్మకంగా నిలిచిపోయేలా విజయవంతం చేయాలన్నారు. ఈ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, బీసీ సెల్ జోనల్ ఇంచార్జ్ ధర్మాన కృష్ణచైతన్య, శాసన సభ్యులు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ పేరాడ తిలక్, బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, రాజాపు హైమవతి అప్పన్న, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్తా, ఎంపీపీ ఆరంగి మురళి, డిసిసిబి అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, యువనేతలు ధర్మాన రామమనోహర్ నాయుడు, తమ్మినేని చిరంజీవి నాగ్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ, ప్రైవేటు శాఖ బ్యాంకులకు నాలుగు రోజులు వరుస సెలవులు

ఐసిఎఫ్(చెన్నై) జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జాతీయ, ప్రైవేటు శాఖ బ్యాంకులకు తైపూసం, గణతంత్ర దినోత్సవాలను పురస్కరిం చుకొని గురు, శుక్రవారాలు, నాలుగో శనివారం, ఆదివారం మొత్తం నాలుగు రోజులు సెలవులు ప్రకటిం చారు.

ప్రస్తుతం వినియోగదారులు మొబైల్ ఫోన్‌లో గూగుల్‌పే, ఫోన్‌పే అని డిజిటల్ నగదు పరివర్తన చేపట్టడంతో బ్యాంకులకు సెలవులు ప్రకటించినా, నగదు డ్రా చేయడం, డిపాజిట్ చేయడంలో ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు.

భారత గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
వంశీ కల్చరల్ & ఎడ్యుకేషనల్ ట్రస్ట్
శ్రీ త్యాగరాయగానసభ
లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో
ఆహ్వానం
ప్రముఖ రచయిత్రుల పేర్లమీద
వంశీ-లేఖిని జాతీయ సాహితీ పురస్కారాల ప్రదానం-2024
30-01-2024 మంగళవారం సా॥ 5 గంటలకు
గుండవరపు హనుమంతరావు కళా వేదిక (మొదటి అంతస్తు) శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్
ముఖ్యఅతిథి : శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి, ప్రముఖ రచయిత్రి
సభాధ్యక్షులు : కళాబ్రహ్మ, విశ్వకళా సేవాభూషణ, శిరోమణి డా॥ వంశీ రామరాజు, వంశీ సంస్థల వ్యవస్థాపకులు
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్దనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
కార్యక్రమ నిర్వహణ : శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి, అధ్యక్షురాలు, లేఖిని
పురస్కార గ్రహీతల వివరాలు

| క్రసం. | పురస్కారం పేరు | పురస్కార గ్రహీత | పరిచయకర్త |
|---|---|---|---|
| 1. | ఇల్లిందల సరస్వతీదేవి (1918-1988) | ఆచార్య సుమతీ నరేంద్ర | శైలజా మిత్ర |
| 2. | పద్మభూషణ్ డా॥ భానుమతీ రామకృష్ణ (1926-2005) | వారణాసి నాగలక్ష్మి | సరస్వతి కరవది |
| 3. | ద్వివేదుల విశాలాక్షి (1929-2014) | చెంగల్వల కామేశ్వరి | ఉమాదేవి కల్వకోట |
| 4. | గోవిందరాజు సీతాదేవి (1932-2014) | సుజల గంటి | భార్గవీ రఘురామ్ |
| 5. | అబ్బూరి ఛాయాదేవి (1933-2018) | పొల్కంపల్లి శాంతాదేవి | రేణుకా అయోలా |
| 6. | మాదిరెడ్డి సులోచన (1935-1983) | అల్లూరి గౌరీలక్ష్మి | నండూరి సుందరీ నాగమణి |
| 7. | డా॥ సి. ఆనందారామం (1935-2021) | గంటి భానుమతి | మణి వడ్లమాని |
| 8. | ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి (1936) | తురగా జయశ్యామల | కస్తూరి అలివేణి |
| 9. | యద్దనపూడి సులోచనారాణి (1940-2018) | జి.ఎస్. లక్ష్మి | నళిని ఎర్రా |

డా॥ తెన్నేటి సుధాదేవి అధ్యక్షురాలు, వంశీ
శైలజ సుంకరపల్లి మేనేజింగ్ ట్రస్టీ, వంశీ
కళా శారద దీక్షితులు కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ
వంశీలో జీవిత సభ్యులుగా చేరి మీ సహకారం అందించండి - సెల్: 9849023852

